క్లుప్తంగా

తులసిమాల అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్ :నగరంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారిని పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శత నామాలతో అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని మొండేటి వీధి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అసత్య ప్రచారం తగదు

శ్రీకాకుళం: శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్‌పై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఇది తగదని శ్రీకాకుళం రూరల్ మండల టీడీపీ నాయకులు అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మూకళ్ల శ్రీనివాసరావు, ముద్దాడ రామకృష్ణలు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంగా ఓ యూట్యూబ్ చానెల్లో ఇష్టానుసారంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి విధానాలు మానుకోకుంటే సహించేది లేదని, తగిన గుణపాఠం చెబుతామన్నారు. రౌడీయిజానికి తెలుగుదేశం వ్యతిరేకమని స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నివాళులు అర్పిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కృష్ణాపురం పంచాయతీ గొర్లెపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు సోదరుడి కుమారుడు సంతోష్‌నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన భౌతికకాయాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వార్డెన్ మహంతి కృష్ణమూర్తి, మహంతి అప్పలస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు దన్నాన హరి, మీసాల శ్రీనివాసరావు, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

ఎచ్చెర్ల : బెజ్జిపురంలో ఆదివారం ఉదయం 9 గంటలకు బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు శనివారం తెలిపారు. దీనిలో భాగంగా పార్టీ నూతన కమిటీ అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరుకానున్నారని, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ప్రజల్లోకి 'కూటమి' వైఫల్యాలు

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు
- ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత: మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు కుంభా రవిబాబు, ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావు, నర్తు రామారావు తదితరులు

శ్రీకాకుళం రూరల్ : ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధికారమే పరమావధిగా ఐదు కోట్ల మంది ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దారుణంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం పెదపాడులో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ బాబు ష్యూరిటీకి గ్యారెంటీ లేదని, అన్నీ అబద్ధపు హామీలే తప్ప ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గ్రామగ్రామాన టీడీపీ మోసపూరిత హామీలను చాటి చెప్పాలన్నారు. గెలిచాక మేనిఫెస్టోను పక్కన పెట్టే పార్టీగా తెలుగుదేశానికే ఘనత దక్కుతుందని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో రూ.14 లక్షల కోట్లు అప్పు చేశారని అప్పట్లో చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారన్నారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులకు సంవత్సరానికి రూ.20వేలు చొప్పున పెట్టుబడి సహాయం కింద ఇస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ మాటే మర్చిపోయారని మండిపడ్డారు. ఖజానా ఖాళీ అయ్యిందంటూ దొంగ లెక్కలు చెబుతూ ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. తల్లికి వందనం కింద అర్హులు 87 లక్షల మంది ఉండగా కేవలం 63 లక్షల మందికే ఇస్తున్నట్లు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. సూపర్‌సిక్స్, సెవెన్ అంటూ 143 హామీలు ఇస్తూ మభ్యపెట్టి మోసగించారన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో వివిధ పథకాల పేరిట రూ.79,816 కోట్లు ఇవ్వాల్సి ఉండగా అందులో కొన్ని పథకాలకు మాత్రమే రూ.17,170 కోట్లు ఇస్తూ చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

● మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ పార్టీని బలోపేతానికి గ్రామాల్లో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే టీడీపీ మేనిఫెస్టో తెలిసిపోతుందని, అందులో ఏవీ అమలు కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మన లక్ష్యమని చెప్పారు.

● పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. 50 డివిజన్లలో ప్రచారం చేపట్టి నగరమంతా చాటిచెప్పాలన్నారు.

– వైఎస్సార్ సీపీ తూర్పుకాపు, కళింగవైశ్య కుల విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన ప్రతిపక్ష పార్టీగా ఉందన్నారు. ఇలాంటి సమయాల్లో అధికార పార్టీ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రతీఒక్కరూ కూటమి బూటకపు హామీలు, మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.

● పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదేల పురుషోత్తం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు.

● సభాధ్యక్షుడు చిట్టి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పట్టణ పార్టీ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, గార మండల పార్టీ అధ్యక్షుడు పీస గోపి, మండల పరిషత్ అధ్యక్షులు అంబటి నిర్మల, గొండు రఘురామ్, జెడ్పీటీసీ సభ్యులు రుప్ప దివ్య, మార్పు సుజాత, గొండు కృష్ణ, పీఏసీఎస్ గొండు కృష్ణ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు ఎం.ఎ.బేగ్, మార్పు పృథ్వీ, ముంజేటి కృష్ణ, రౌతు శంకరరావు, బోర నర్సునాయుడు, మూకళ్ల సుగుణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, రాష్ట్ర ప్రతినిధులు నక్క రామరాజు, బూక్యూరు ఉమామహేశ్వరరావు, ఎన్ని ధనుంజయరావు, చల్లా రవికుమార్, అంబటి శ్రీనువాసరావు, మూకళ్ల తాతబాబు, పొన్నాడ రుషి, కోణార్క్ శ్రీను, గద్దిబోయిన గోపాలకృష్ణ, కోనాడ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం

ప్రసాదరావు నాయకత్వంలోనే..



మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలోనే వైఎస్సార్ సీపీ నాయకులంతా పనిచేస్తున్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలతో గ్రామాల్లో ఇప్పటికే వ్యతిరేకత మొదలయ్యింది. ఈ తరుణంలోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రణాళికబద్ధంగా పనిచేయాలి. చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను సోషల్ మీడియా వేదికగా బయటపెట్టాలి. ఏడాది కాలంలో చేయలేని పనులను ప్రజలకు చాటి చెప్పాలి. ఎన్నికల ముందు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా నిలిచినప్పటికీ వైఎస్సార్ సీపీకి 40 శాతం ఓట్లతో బలంగా ఎదుర్కోగలిగాం.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

కలిసికట్టుగా పనిచేద్దాం



కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఎన్నో అరాచకాలకు నిలయంగా మారింది. ఇలాంటి సందర్భంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలం చేకూర్చుకునేలా అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

సమన్వయంతో పనిచేద్దాం..



జిల్లాలోని యువత అంతటినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం. తన తండ్రి ధర్మాన ప్రసాదరావు వివిధ కార్యక్రమాలకు, సమావేశాలకు దూరంగా లేరు. ఆయన ఆలోచన విధానంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని క్రియాశీలకంగా నడిపిస్తున్నారు. త్వరలోనే అన్ని కార్యక్రమాలు, సమావేశాల్లో చురుగ్గా పాల్గొంటారు.

– ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత

అలరించిన హరికథ ప్రదర్శన



హరికథ చెబుతున్న శివపార్వతి

శ్రీకాకుళం కల్చరల్: ప్రాచీన హరికథను, కథకులను ప్రోత్సహించడం అభినందనీయమని అభినయ నృత్యనికేతన్ దర్శకులు తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యం అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో శనివారం హరికథా ప్రదర్శన జరిగింది. తెనాలికి చెందిన సీహెచ్ శివపార్వతి భాగవతారిణి ని 'ప్రమీలార్జునీయం' హరికథ గానం చేశారు. వయొలిన్‌పై దుంపల ఈశ్వరరావు, మృదంగంపై చలపరాయి వినోద్ కుమార్‌లు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, బంకుపల్లి రమేష్‌శర్మ, కొంక్యాన మురళీధర్, వి.వి.ఆర్.మూర్తి, ఎం.రాజు, మల్లెమొగ్గల లక్ష్మీ, ఎం.వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మందుల పంపిణీలో నిబంధనలకు తూట్లు

- ఫార్మసిస్ట్ లేకుండానే పంపిణీ
- చిన్నారుల వ్యాక్సినేషన్‌కు పర్యవేక్షణ కరవు



ఫార్మసిస్టు లేని మందుల గది

శ్రీకాకుళం : నగరంలోని రామకృష్ణనగర్ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఫార్మాసిస్టు లేకుండానే మందుల పంపిణీ జరుగుతోంది. నిబంధనల ప్రకారం మందుల షాపులలో సైతం ఫార్మసిస్ట్ పర్యవేక్షణలోనే మందుల అమ్మకాలు జరగాలి. అయితే ఇక్కడ మాత్రం శనివారం ఫార్మసిస్టు లేకుండానే మందులు పంపిణీ చేశారు. రెండో శనివారం అయినప్పటికీ ఆరోగ్య సిబ్బందికి సెలవు ఉండదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సైతం శనివారం విధులకు హాజరయ్యారు. రామకృష్ణ నగర్ హెల్త్ సెంటర్‌లో మాత్రం వైద్యాధికారి, ఫార్మసిస్ట్, హెల్త్ విజిటర్లు విధులకు డుమ్మా కొట్టారు. స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంల నేతృత్వంలోనే వ్యాక్సినేషన్ జరిగింది. ఇది సాధారణంగా జరిగేదే అయినప్పటికీ, మందులు పంపిణీ మాత్రం స్టాఫ్నర్సులు, ఏఎన్ఎంలు చేయకూడదు. మందులు వికటిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత వద్ద ప్రస్తావించగా వ్యాక్సినేషన్ ఏఎన్ఎంల ఆధ్వర్యంలోనే జరుగుతుందని, మందుల పంపిణీ మాత్రం ఫార్మసిస్ట్ పర్యవేక్షణలోనే జరగాల్సి ఉంటుందన్నారు. ఈ విషయమై విచారణ చేస్తానని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

రణస్థలం: మెమో 57 అమలుకు ప్రభుత్వాన్ని ఒప్పించాలని, ఈ నెల 18న జరగబోయే శాంతియుత నిరసనకు హాజరై సంఘీభావం తెలియజేయాలని మండల ఉపాధ్యాయులు సంఘ నేతలు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును కోరారు. ఈ మేరకు శనివారం కోష్ట విచ్చేసిన ఎమ్మెల్సీకి ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయుల బదిలీల్లో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జూలై 18న జరగబోయే శాంతియుత నిరసనకు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌ల వద్దకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌టీయూ రణస్థలం మండల ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు, ఆపస్ రణస్థలం మండల అధ్యక్షుడు జి.చిన్నికృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న సంఘ నేతలు

17న నీలమ్మతల్లి ఆవేటి వారం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పెద్దబరాటం వీధిలో నీలమ్మతల్లి అమ్మవారి ఆవేటి వారం ఈ నెల 17న నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త బరాటం సాయిరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి మూలవిరాట్‌కు పాలాభిషేకాలు, ముర్రాట్ల సమర్పణ ఉంటుందని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల : పొన్నాడ ఎస్ఎస్ పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఆదివారం కొత్తపేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు, సెగిడిపేట, మాలముద్దాడ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ యోగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్ కష్టాలకు మోక్షమెప్పుడో?



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: పెంట గ్రామస్తులకు విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి మేఘాలు కమ్ముకున్నా, కొద్దిగా గాలులు వీచినా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. సరైన ట్రాన్స్ ఫార్మర్ లేకపోవడంతో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతోంది. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నదాతకు సాగునీటి కష్టాలు



జాడలో వర్షాలు లేక తాగునీటితో వరినారును బతికించుకుంటున్న రైతు

- వరినారు బతికించేందుకు పాట్లు
- వర్షాలు లేక ఎండిపోతున్న పొలాలు

జి.సిగడాం : వరుణుడి కరుణ లేకపోవడంతో వరినారు ఎండిపోతోంది. వరినారుకు జీవం పోతుండటంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. వారం క్రితం చిరుజల్లులు పడటంతో వర్షాలు పడతాయని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. కొన్ని ప్రాంతాల్లో వరినారు ఎండిపోతుండటంతో బిందెలతో నీరు మోసి తడుపుదామన్నా చెరువుల్లో చుక్కనీరు కూడా లేకపోవడంతో అన్నదాతలకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. జి.సిగడాం మండలంలోని జగన్నాథవలస, వెంకయ్యపేట, చెట్టుపొదిలాం, ఎస్.పి.ఆర్.పురం, జాడ, డి.ఆర్.వలస, ముషినివలస, మద్రివలస, జి.సిగడాం, గెద్దకంచరాం, సర్వేశ్వరపురం, ఎందువ, నడిమివలస తదితర ప్రాంతాల్లో సాగునీటి కష్టాలు దారుణంగా ఉన్నాయి.



సర్వేశ్వరపురంలో సుదూర ప్రాంతం నుంచి నీటిని తీసుకొచ్చి నారును తడుపుతున్న రైతు



పైపులైన్ నీటితో వరినారును బతికిస్తున్న రైతులు



జాడ-ముషినివలస గ్రామాల మధ్య నారు దుస్థితి

చురుగ్గా కల్వర్టు పనులు



పెదపాడు రహదారి వద్ద వారం రోజులుగా కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాఫిక్‌ను ఓ ప్రైవేట్ రహదారి గుండా మళ్లించారు. ఇప్పటికే పెదపాడు రోడ్డు విస్తరణలో భాగంగా అర కిలోమీటరు వరకూ కాలువల నిర్మాణాలు పూర్తయ్యాయి. కల్వర్టుతో పాటు ఫోర్‌లైన్స్ రహదారి విస్తరణ కూడా ఉందని, ఈ పనుల కోసం రూ.2కోట్ల 40 లక్షలు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ తెలిపారు.

– శ్రీకాకుళం రూరల్

హరినామ సంకీర్తన



కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు శనివారం నగరవీధులలో హరినామ సంకీర్తనలు ఆలపించారు. ముందుగా అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్లేపల్లి ఉమామహేశ్వరరావు బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనా గాన లహరి వీనుల విందుగా సాగింది. 41 రోజుల పాటు 41 ఆలయాలలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించనున్నట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు.

– శ్రీకాకుళం కల్చరల్